సాక్షి ప్రకాశం

శనివారం | 6 | మే | 2023



సంక్షేమ ఫలాలు పొందని ఇల్లే లేదు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు పొందని ఇల్లే లేదని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు.

- 8లో..



పునరావాస కాలనీల్లో వసతులు కల్పించాలి

వెలిగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో వసతులు కల్పించాలని జేసీ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మొక్కజొన్న క్వింటాకు రూ.1,962 మద్దతు ధర

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు కల్పిస్తున్న నేపథ్యంలో మొక్క జొన్న క్వింటాకు రూ.1,962గా నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతులు వారికి సంబంధించిన రైతు భరోసా కేంద్రాల్లో మే 12వ తేదీ వరకు సంబంధిత వీఏఏ, వీహెచ్‌ఏల ద్వారా సీఎం యాప్‌లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని మొక్క జొన్న రైతులు పేర్లు నమోదు చేసుకునే సమయంలో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేసుకోవాలన్నారు. పంట కొనుగోలుకు సంబంధించి రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందన్నారు. రైతులు గమనించి పంట విక్రయించే సమయంలో మొబైల్ నంబర్‌కు ఆధార్, బ్యాంకు వివరాలు లింక్ ఉందో లేదో చూసుకోవాలన్నారు. మొక్కజొన్నలో 14 శాతం లోపు తేమ శాతం ఉండేలా రైతులు జాగ్రత్త వహించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించకుండా ఉండాలన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



తపాలా ఉద్యోగుల సంఘం సభలో ప్రసంగిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాడుదామని తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు షేక్ ఫిరోజ్ పిలుపునిచ్చారు. నగరంలోని సంతపేటలో ఆచార్య రంగా భవన్‌లో అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘాల ప్రకాశం డివిజన్ సంయుక్త ద్వైవార్షిక మహాసభలు శుక్రవారం నిర్వహించారు. సభల్లో కార్యదర్శుల నివేదికతో పాటుగా ఆర్థిక నివేదిక సమర్పించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గ్రూప్ సీ కార్యదర్శిగా ఎ.హరిబాబు, పోస్ట్‌మెన్ ఎంటీఎస్‌గా పి.శంకరనాయక్, జీడీఎస్ కార్యదర్శిగా కె.చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా నలుమూలల నుంచి తపాలా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎన్ఈపీఈ నాయకులు పిడూరి వెంకటేశ్వరరావు, టి.వరలక్ష్మి, డి.పద్మావతి, కె.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండలో హైకోర్టు జడ్జి పూజలు



ప్రసన్నాంజనేయస్వామికి పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి పీవీ జ్యోతిర్మయి దంపతులు

అద్దంకి రూరల్: బాపట్ల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామిని శుక్రవారం హైకోర్టు జడ్జి పీవీ జ్యోతిర్మయి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన అర్చకులు, సిబ్బంది జడ్జి దంపతులను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అర్చకులు జడ్జి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి బాబునాయక్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సాగుకు భరోసా

రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎన్నో పథకాలను అమలు చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ సీజన్ ఆరంభంలో పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నుంచి బయటపడేసేందుకు ఏటా మూడు విడతల్లో రూ.13,500 రైతుభరోసా నగదు అందిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది. ఏటేటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది కొత్తగా 5,082 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో లక్షల మంది రైతులు వందల కోట్ల సాయాన్ని పొందుతున్నారు.

● రైతు భరోసాతో వ్యవసాయం పండుగ
● జిల్లాలో కొత్తగా 5,082 మంది దరఖాస్తు
● నాలుగేళ్లలో రూ.1421.77 కోట్లు అందజేత





పొలం సాగు చేస్తున్న రైతు

సంవత్సరం	రైతులు	రైతుభరోసా నగదు రూ.కోట్లలో
2019-20	2,30,453	311.11
2020-21	2,61,660	353.24
2021-22	2,74,790	370.97
2022-23	2,86,256	386.45

నాలుగేళ్లలో అందించిన నగదు మొత్తం: 1421.77

మార్కాపురం: టీడీపీ హయాంలో దండగలా మారిన వ్యవసాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వినూత్న పథకాలతో రైతులకు బాసటగా నిలుస్తూ పండుగ లాగా మార్చారు. ఆర్‌బీకేల ఏర్పాటుతో పల్లెల్లో వ్యవసాయ విప్లవం ప్రారంభమైంది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్లు, పంట కొనుగోళ్లు అన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా చేరువయ్యాయి. పనులు మానుకొని విత్తనాలు, ఎరువుల కోసం రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేసే రోజులు పోయాయి. సొంతూరుకే అన్నీ తరలి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంటలు సాగుచేసుకునేందుకు పెట్టుబడులకు ఇబ్బందిపడకుండా 2019 అక్టోబర్ 15వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో ఎనిమిది వ్యవసాయ సబ్ డివిజన్లు ఉన్నాయి. దర్శి, గిద్దలూరు, కనిగిరి, కొండపి, మార్కాపురం, ఒంగోలు, సంతనూతలపాడు, వైపాలెం సబ్‌డివిజన్లు ఉన్నాయి. వైఎస్ఆర్ రైతు భరోసా కింద జిల్లాలోని రైతులకు నాలుగేళ్లలో రూ.1421.77 కోట్లు అందించారు.

అర్హులు ఎవరంటే..

10 సెంట్ల పైన నుంచి 4.30 ఎకరాల లోపు సాగు చేస్తున్న ప్రతి రైతు రైతు భరోసాకు అర్హులే. కుటుంబంలో ఒకరికి మాత్రమే రైతు భరోసా వర్తిస్తుంది. పట్టాదారు పాస్ పుస్తకం కచ్చితంగా ఉండాలి. గత నెల మొదటి వారం నుంచి కొత్తగా రైతు భరోసాకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చనిపోయిన రైతుల స్థానంలో వారి నామిని, కొత్తగా తమ పొలాలు మ్యుటేషన్ చేసుకున్న రైతులు, కొత్తగా పొలాలు కొనుక్కొని ఇప్పటి వరకు రైతు భరోసా అందని వారు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీతో రైతు భరోసాకు గడువు ముగిసింది. జిల్లావ్యాప్తంగా కొత్తగా 5,082 మంది దరఖాస్తు చేసుకున్నారు. మార్కాపురం మండలంలో 177 మంది రైతు భరోసాకు దరఖాస్తు చేసుకున్నారు.

ఏటా రూ.13,500 సాయం:

ఏటా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి కింద రూ.13,500 సహాయం అందిస్తోంది. మొదట్లో సీఎం వైఎస్ జగన్ ఏటా రూ.12,500 ఇస్తానని ప్రకటించి ఆ తరువాత మరో వెయ్యి అదనంగా చేర్చి రూ.13,500 ఇస్తున్నారు. ఏటా మూడు విడతల్లో ఈ సహాయం రైతుల ఖాతాల్లో జమవుతుంది. పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ మొత్తాన్ని అందిస్తున్నారు. ఈ నగదు రైతుల పెట్టుబడులకు ఉపయోగపడుతుంది. ట్రాక్టర్లు, అరకల ఖర్చులు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు వడ్డీ వ్యాపారుల దగ్గరికి వెళ్లకుండా ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో కొనుక్కుంటున్నారు.

నూతనంగా 5,082 మంది దరఖాస్తు



నూతనంగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 3వ తేదీ తుది గడువు కావడంతో జిల్లా వ్యాప్తంగా 5,082 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులన్నిటినీ పరిశీలిస్తాం. రైతు భరోసా ద్వారా అందించే ఆర్థిక సహాయం రైతులకు చాలా ఉపయోగపడుతుంది.

– శ్రీనివాసరావు, జాయింట్ డైరెక్టర్, ఒంగోలు

ఏటా రైతు భరోసా అందుతోంది



2019 నుంచి ప్రతి ఏటా నాకు రైతు భరోసా అందుతోంది. సంవత్సరానికి రూ.13,500 వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడులకు చాలా ఉపయోగంగా ఉంది. ఈ ఏడాది కూడా వస్తుందని అనుకుంటున్నాను. రైతు భరోసా వల్ల అప్పులు చేసే అవసరం తప్పింది.

– టి రామిరెడ్డి, రైతు వేములకోట

అర్హులైన రైతులందరికీ రైతు భరోసా



ఈ నెలాఖరులో ప్రభుత్వం రూ.7500 రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. ఏడాదికి రూ.13500 అందుతుంది. ఖరీఫ్‌లో రైతులు సజ్జ, జొన్న, కంది తదితర పంటలు సాగు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. మళ్లీ అక్టోబర్‌లో రూ.4 వేలు రైతులకు రైతు భరోసా ద్వారా అందుతాయి. మరో రూ.2 వేలు జనవరిలో వస్తాయి. రైతులు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ఉండేందుకే ప్రభుత్వం రైతు భరోసా అందిస్తోంది.

– దేవిరెడ్డి శ్రీనివాసులు, ఏఓ, మార్కాపురం

విద్యాసంవత్సరం ప్రారంభంలోపే నాడు-నేడు పూర్తి చేయాలి

● విద్యాశాఖ అధికారులతో మంత్రి బొత్స, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ సమావేశం
● వెబెక్స్ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ఒంగోలు టౌన్: రాబోవు విద్యా సంవత్సరం ప్రారంభంలోపే మనబడి నాడు-నేడు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం వెబెక్స్ ద్వారా జిల్లా విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నాలుగు అంశాలను జూన్ 12 లోపు పూర్తి చేయాలన్నారు. మనబడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, పాఠశాలల్లో 100 శాతం పిల్లల నమోదు, జగనన్న గోరుముద్దలపై అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో తిరిగి పాఠశాలలు తెరిచే లోపే నాడు-నేడు పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పాఠశాలకు తప్పని సరిగా వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని, మంచి నాణ్యత కలిగిన జగనన్న విద్యా కానుక కిట్‌లను అందజేయాలన్నారు. పాఠశాలల్లో నూటికి నూరు శాతం నమోదయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం మెనూలో సూచించిన విధంగానే ప్రమాణాలు కలిగిన మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని ఆదేశించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, పీఈవోలు, డిప్యూటీ విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్షణ అధికారులు, ఇంటర్మీడియెట్ విద్య అధికారులు, జిల్లాలోని అన్నీ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

పేదింటి వివాహాలకు ప్రభుత్వం అండ

● వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా లబ్ధిదారులకు అందజేత
● పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు అర్బన్: బిడ్డలకు వివాహాలు చేయడంలో తల్లిదండ్రులకు భారం లేకుండా ప్రతి పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాల్లో భాగంగా రెండో జాబితాలోని లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేసే కార్యక్రమన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. దీనికి అనుబంధంగా ప్రకాశం భవనంలో కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కలెక్టర్‌తో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో లబ్ధిదారులకు రూ.2,16,80,000 బ్యాంకు చెక్కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లో ఆడపిల్లలకు కళ్యాణమస్తు, ముస్లిం మైనార్టీల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీతోఫా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం మేలు చేస్తోందన్నారు. బాల్య వివాహాలను నివారించడంతో పాటు ప్రతి ఆడబిడ్డ కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించడం ప్రామాణికంగా తీసుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి అర్హులను గుర్తిస్తున్నామన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వధువులకు వారి బ్యాంకు ఖాతాలో ఈ ఆర్థిక సహాయం జమ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో వివాహం చేసుకున్న జిల్లాలోని 276 మంది అర్హులను గుర్తించినట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కేవలం బిడ్డల వివాహం విషయంలోనే కాకుండా వారి చదువులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తూ అండగా నిలుస్తోందన్నారు. అన్నీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సహాయం మరువలేం



తన తల్లితో లబ్ధిదారు అహల్య

లబ్ధిదారుల్లో ఒకరైన మద్దిపాడు మండలం నందిపడు గ్రామానికి చెందిన అహల్య మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు ఉన్న 20 సెంట్ల భూమిలో సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో బీటెక్ పూర్తి చేశానని చెప్పారు. ఏడో తరగతి చదువుతున్న తమ్ముడికి అమ్మ ఒడి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతోందన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం పలు పథకాల ద్వారా అండగా నిలుస్తోందన్నారు. చదువులో సహాయం అందించిన ప్రభుత్వం వివాహం విషయంలో కూడా తల్లిదండ్రులకు భారం లేకుండా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ రుణపడి ఉంటామన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

● పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బాలినేని



బాలినేనికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో ఉన్న వీరాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో సీతా సమేత రామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ విగ్రహ ప్రతిష్ట ఉత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలినేని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆలయ కమిటీ తరఫున ఘనంగా సత్కరించారు. నగర పాలక సంస్థ దేవదాయ శాఖ పరిశీలకులు చెన్నారెడ్డి వేణుగోపాల్, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్యనారాయణ (బుజ్జి), కార్పొరేటర్ కారంశెట్టి పుష్పలత, వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ దుగ్గిరెడ్డి వీరాంజనేయులు రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పిల్లి హరినారాయణ రెడ్డి, కోట రాంబాబు గుప్తా, బత్తుల ప్రమీల, మాగతోటి మాధవి తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవస్థానం ప్రాంగణం అంతా కిటకిటలాడింది. కేశవస్వామిపేటలో రామ నామం మార్మోగింది.

గ్రానైట్ కార్మికుల భద్రత, సంక్షేమంలో రాజీపడొద్దు

● ఈనెల 15 లోపు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి
● ఇంటర్ సప్లిమెంటరీ క్యాంపులో పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులతో కలెక్టర్ మాటామంతి



రామతీర్థంలోని గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, మైన్స్ డీడీ జగన్నాథరావు



జగనన్న కాలనీ లేఅవుట్‌ల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్


చీమకుర్తి: గ్రానైట్ క్వారీల్లో పనిచేసే కార్మికుల భద్రత, సంక్షేమంపై యజమానులు రాజీపడొద్దని, వారి కుటుంబాలకు అండగా నిలవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ రామతీర్థంలోని గ్రానైట్ క్వారీలు, జగనన్న కాలనీల లేఅవుట్‌లను సందర్శించారు. గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల నుంచి తరచూ కాలుష్యం, ఇతర శబ్ద కాలుష్యాలతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికుల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు గ్రానైట్ క్వారీలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. మైనింగ్ రంగంలో యజమానులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహకారంతో తన వంతు పరిష్కారానికి కృషి చేస్తానని గ్రానైట్ యజమానులకు భరోసా ఇచ్చారు. కార్మికులకు శిక్షణనిచ్చే వీటీసీ కేంద్రంలో శిక్షణనిచ్చే పరికరాల పనితీరు, వాటి వలన కార్మికులకు కలిగించే భద్రతా విధానాలను వీటీసీ కేంద్రం నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. పాలిషింగ్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థాలను డంప్ చేసేందుకు సరైన స్థలం లేకపోవడంతో రోడ్ల వెంట పడేయాల్సి వస్తుందని, అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా ఫ్యాక్టరీ యజమానులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం పాటిమీదపాలెం రోడ్డులో చీమకుర్తి అర్బన్‌కు చెందిన జగనన్న కాలనీ ఇళ్లను సందర్శించారు. ఈనెల 15వ తేదీ లోపు ఇళ్ల పూర్తి చేసుకున్న వారు ఇళ్లను ప్రారంభించి ఇళ్లల్లో చేరాలని స్థానిక అధికారులకు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ క్యాంప్‌ను సందర్శించిన కలెక్టర్:

చీమకుర్తి బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ఫెయిలైన బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఇంటర్ సప్లిమెంటరీ క్యాంప్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. చీమకుర్తి, దర్శి, పొదిలి, దేవరపాలెం, కనిగిరి ప్రాంతాలకు చెందిన 127 మంది బాలికలు ఇంటర్ ఫెయిలైన వారు ఈ క్యాంప్‌లో శిక్షణ పొందుతున్నట్లు కలెక్టర్‌కు కళాశాల నిర్వాహకురాలు తెలిపారు. ఈనెల 2 నుంచి ప్రారంభమైన శిక్షణ కేంద్రం 21 వరకు జరుగుతుందని, 25న సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా బాలికలతో కలెక్టర్ మాట్లాడుతూ ఈ సారి పరీక్షల్లో నూరు శాతం పాస్ కావాలని తెలిపారు. మైన్స్ డీడీ బీ.జగన్నాథరావు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య పాల్గొన్నారు.

మణికంఠ క్వారీలో అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు:

మణికంఠ గ్రానైట్ క్వారీ లీజు కాలపరిమితి గత 29తో పూర్తయినా క్వారీ యాజమాన్యం అక్రమంగా రాళ్లను తవ్వుకుంటూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతుందని స్థానిక గుండా శ్రీనివాసరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



మార్కాపురం: మెరుపులెలా వస్తాయ్..? ఉరుముల శబ్దం ఎలా ఉద్భవిస్తుంది..? పిడుగులు ఎలా పడతాయ్? ఈ ప్రశ్నలు ఆధునిక కాలంలోనూ చాలా మంది మదిని తొలుస్తూ ఉంటాయి.! చెవులు హోరెత్తించే ఉరుములు, కళ్లను జిగేల్మనించే మెరుపులు, ప్రాణాలు హరించే పిడుగులకు ప్రధాన కారణం క్యుములోనింబస్ మేఘాలు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు నీరు ఆవిరిగా మారి ఆకాశంలో దాదాపు 25 వేల అడుగుల ఎత్తు వరకు మేఘాలు ఏర్పడతాయి. తక్కువ బరువున్న ధనావేశిత(+) మేఘాలు పైకి.. అధిక బరువుండే రుణావేశిత(-) మేఘాలు కింది భాగానికి వస్తాయి. రుణావేశిత మేఘాల్లోని ఎలక్ట్రాన్లు సమీపంలోని ధనావేశిత మేఘాలవైపు ఆకర్షితమవుతుంటాయి. ఈ క్రమంలో భారీ శబ్దాలు, మెరుపులు వస్తాయి. అయితే, ధనావేశిత మేఘాలు చాలా ఎత్తుకు వెళ్లినప్పుడు.. రుణావేశిత మేఘాల్లోని ఎలక్ట్రాన్లు దిగువకు ప్రయాణిస్తూ విద్యుత్ క్షేత్రంగా మారి భూమి వైపు దూసుకొస్తాయి. దానినే మనం 'పిడుగు' అంటాం.

ఉరుము మెరుపు పిడుగు

- మండు వేసవిలోనూ ఉరుముల వర్షాలు
- భయంగొల్పేలా పడుతున్న పిడుగులు
- మరోవైపు దూసుకొస్తున్న 'మోచా' తుఫాన్
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు, వైద్యులు

సూర్యుడి ఉపరితలం కంటే ఐదు రెట్ల వేడి



మెరుపులు ఏర్పడినపుడు వాటి చుట్టూ సుమారు 20 వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉత్పన్నమవుతుంది. సూర్యుడి ఉపరితం దగ్గర 5,500 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే మెరుపులు మెరిసినపుడు అంతకు ఐదు రెట్ల వేడి ఉంటుంది. అంత వేడి ఒక్కసారి గాలి గుండా ప్రయాణించినప్పుడు పక్కనే ఉన్న గాలిలోని కణాలు వేడెక్కి దూరం జరిగేందుకు ప్రయత్నిస్తాయి. ఆ సమయంలో వాటి పక్కనే ఉన్న కణాలను వేగంగా ఢీకొట్టడం వల్ల పెళపెళమంటూ భారీ శబ్దాలు వినిపిస్తాయి. ధ్వని ప్రయాణించే వేగం కంటే కాంతి వేగం ఎక్కువ కాబట్టి ముందుగా మెరుపులు కనిపించి ఆ తరవాత శబ్దాలు వినిపిస్తాయి.

ముందే గుర్తించవచ్చు

పిడుగులను ముందుగా గుర్తించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ వజ్రపథ్ పేరుతో స్మార్ట్‌ఫోన్ యాప్ రూపొందించింది. ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో సెన్సార్లు కూడా ఏర్పాటు చేశారు. వాటి ద్వారా వచ్చే సమాచారాన్ని విశ్లేషిస్తూ ఏ ప్రాంతంలో పిడుగు పడే అవకాశం ఉందో కనీసం నలభై నిమిషాల ముందే హెచ్చరిస్తున్నారు.

ప్రాణాలు హరిస్తున్న పిడుగులు



పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

ఇటీవల కాలంలో జిల్లాలో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం పడుతోంది. గత వారం రోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. గత నెల 23న దర్శి మండలం శామంతపుడిలో పిడుగుపాటుకు తిరుపతయ్య(47) మృతి చెందాడు. 30న కొనకనమిట్ల మండలం ఇరసలగుండం గ్రామంలో పిడుగుపడి రాచమళ్ల చిన్నచెన్నారెడ్డికి చెందిన 15 గొర్రెలు మృతి చెందాయి. అలాగే గత ఏడాది ఏప్రిల్ 30న పుల్లలచెరువు మండలం శతకోడులో పిడుగుపడి మల్లయ్య అనే వ్యక్తితోపాటు 5 మేకలు చనిపోయాయి. గత ఏడాది మే 1న రాచర్ల మండలం అచ్చంపేటలో పిడుగుపడి 9 మేకలు, ఇదే రోజున పామూరు మండలం కోడిగుంపలలో ఓ గేదె, 6వ తేదీన పెద్దారవీడు మండలం పోతంపల్లి గ్రామంలో చిన్న కోటిరెడ్డికి చెందిన ఎద్దు మృత్యువాతపడ్డాయి.

తప్పించుకోవడం ఎలా?

- ఉరుములు, మెరుపుల సమయంలో ఇంట్లోనే ఉండటం మంచిది.
- పొలాల్లో పనిచేసే రైతులు ఇళ్లకు లేదా భూమి పొడిగా ఉన్న చోటకు వెళ్లాలి.
- చెట్ల కింద, టవర్ల కింద ఉండటం ఏమాత్రం సరి కాదు.
- సెల్‌ఫోన్, ఎఫ్ఎం రేడియో లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించకూడదు.
- ఒకవేళ తలదాచుకునేందుకు ఆశ్రయం లేనప్పుడు తమను తాము రక్షించుకునేందుకు ప్రయత్నించాలి. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చోవాలి. దాంతో ఆ పిడుగు పడినప్పుడు వెలువడే విద్యుత్ ప్రభావం మన మీద తక్కువగా ఉంటుంది.
- భూమి మీద అరికాళ్లు పూర్తిగా ఆనించకుండా వేళ్ల మీద కూర్చోవాలి.
- ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు ఆపేయాలి. లేదంటే పిడుగు పడినప్పుడు విద్యుత్ తీగల ద్వారా హై వోల్టేజీ ప్రవహించి అవి కాలిపోయే ప్రమాదం ఉంటుంది.
- ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలి.
- ఉరుములతో కూడిన వర్షం వచ్చే అవకాశం ఉందని తెలిస్తే బయటకు వెళ్లకుండా పనులను వాయిదా వేసుకోవాలి.
- స్నానం చేయడం, పాత్రలు కడగటం ఆపేస్తే మంచిది.
- పిడుగు బారిన పడినప్పుడు శరీరంపై రెండు చోట్ల గాయాలవుతాయి. ప్రధానంగా విద్యుత్ ప్రవహించిన చోట, మళ్లీ బయటకు వెళ్లిన చోట(ఎక్కువగా అరికాళ్లపై) గాయాలు అవుతాయి.
- బాధితులను ముట్టుకుంటే షాక్ తగులుతుందనేది అపోహ.
- బాధితులకు సాధ్యమైనంత త్వరగా ప్రథమ చికిత్స అందించాలి.

ప్రతి ఇంటికి తప్పనిసరిగా ఎర్తింగ్ వైరు ఉండేలా చూసుకోవాలి.

సంక్షేమ ఫలాలు పొందని ఇల్లే లేదు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న నాయకులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి
- నాయుడుపాలెంలో గడపగడపకు అపూర్వ స్పందన
- రైతు భరోసా కేంద్రం ప్రారంభం

చీమకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు పొందనటువంటి ఇల్లే లేదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. చీమకుర్తి మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. గ్రామంలోని ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటికి వెళ్లినా పథకాల లబ్ధిదారులు ఉన్నారని వారు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని సంతోషం వ్యక్తం చేశారు.

రూ.1.26 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన...

నాయుడుపాలెం నుంచి తాళ్లూరు మండలం శివరామపురం వరకు రూ.1.26 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక సచివాలయం పరిధిలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని బూచేపల్లి వెంకాయమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో తొలుత బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి డప్పు వాయిద్యాలతో పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లగా, పథకాల లబ్ధిదారులు హారతులతో తిలకం దిద్ది స్వాగతం ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక సర్పంచ్ బొంతా కరుణప్రియ సంతోష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు కూడలి అంజలి మాల కొండయ్య, మాజీ సర్పంచ్ కూరాకుల రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కూరాకుల సుబ్బారెడ్డి, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో వసతులు కల్పించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



వెలిగొండ ప్రాజెక్టుపై సమావేశం నిర్వహిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించిన పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు అంశాలపై స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీతో పాటు సచివాలయం, హెల్త్ క్లినిక్, పాఠశాల వంటి వసతులు కూడా తప్పనిసరిగా కల్పించాలన్నారు. అదేవిధంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళావందనం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మార్కాపురం డీఎస్పీ

ఒంగోలు టౌన్: మార్కాపురం డీఎస్పీగా జి.వీరరాఘవరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా విజిలెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన.. ఇటీవల మార్కాపురం బదిలీ అయ్యారు. సబ్ డివిజినల్ కార్యాలయంలో రిపోర్టు చేసిన అనంతరం ఒంగోలులో ఎస్పీ మలికాగర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు

ఉడుములను వేటాడిన వ్యక్తి అరెస్టు

- రెండు ఉడుములను కాల్చిన నిందితుడు
- జీవించి ఉన్న ఓ ఉడుము స్వాధీనం



అటవీ అధికారుల అదుపులో ఉడుములను వేటాడిన వ్యక్తి

పెద్దదోర్నాల: నల్లమల పెద్దపులుల అభయారణ్యంలోని పెద్దమంతనాల బీటులో ఉడుములను వేటాడిన వ్యక్తిని కొర్రప్రోలు రేంజి అధికారి ప్రసన్నజ్యోతి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వివరాలను విలేకరులకు వెల్లడించారు. పెద్దమంతనాల గూడెం పరిధిలోని అటవీ ప్రాంతంలో గూడేనికి చెందిన భూమని పోతన్న మూడు ఉడుములను వేటాడాడు. రెండు ఉడుములను తినేందుకు కాల్చుకున్నాడు. జీవించి ఉన్న మరో ఉడుము అతని వద్దే ఉంది. పెట్రోలింగ్ విధులు ముగించుకుని వస్తున్న సిబ్బందికి పోతన్న తారసపడటంతో వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా గూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో వాటిని వేటాడినట్లు అంగీకరించాడు. వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 ప్రకారం కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు రేంజి అధికారి తెలిపారు. ఉడుము కళేబరాలకు ఆత్మకూరు వైల్డ్‌లైఫ్ వైద్యుడు జుబేర్ పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం వాటిని దహనం చేసినట్లు చెప్పారు. పెద్దమంతనాల డీఆర్వో మౌలాళి, ఎఫ్‌బీఓ భానుప్రకాష్, తానీషా, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పాలనకు నవరత్నాలే నిదర్శనం



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- గడపగడపలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు వస్తున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్న నవరత్నాలు పథకాలే ఆయన ఉత్తమ పాలనకు నిదర్శనమని మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కొనకనమిట్ల మండలంలోని చింతగుంట ఎస్సీ కాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ఉండేల ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలు, అర్హులకు అందుతున్న తీరు గురించి వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేరుగా వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు ఇంటికే వస్తున్నాయని, దళారీ వ్యవస్థకు ఏ మాత్రం తావులేదని ప్రజలు పేర్కొనడం విశేషం. వర్షం పడుతున్నప్పటికీ కార్యకర్తల ఉత్సాహం మధ్య ఎమ్మెల్యే కేపీ, నాయకులు గడప గడపకూ తిరిగారు. తొలుత ఎమ్మెల్యే, పార్టీ నాయకులకు మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉండేల ప్రసాద్‌రెడ్డి, వార్డు మెంబర్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎంఆర్ఎఫ్ వెంకటేశ్వరరెడ్డి, వేమన కృష్ణారెడ్డి, ఉండేల వెంకటరెడ్డి, చిలంకూరి యలమందారెడ్డి, గందం గురవారెడ్డి, శ్యాంబాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, ఎస్సీసెల్ నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, బీసీ నాయకులు పాలూరి వెంకటేశ్వర్లు ఎంపీడీఓ జనార్దన్, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం కె.గోపాలకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి తీవ్రగాయాలు

- మరో ఇద్దరికి స్వల్పగాయాలు



గాయపడిన చెన్నకేశవులు, సుజాత

కంభం: కూలి విషయంలో జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని యర్రబాలెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే రైతు పొలం కౌలుకు తీసుకుని మామిడి తోట సాగుచేస్తున్నాడు. ఆ తోటలో కనిగిరికి చెందిన భార్యాభర్తలైన చెన్నకేశవులు, సుజాత కూలికి ఉంటున్నారు. వారికి ఇవ్వాల్సిన కూలి డబ్బు విషయంలో రైతుతో జరిగిన ఘర్షణలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న అల్లూరయ్య, సందీప్‌లకు కూడా స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం చెన్నకేశవులు, సుజాతలను మార్కాపురం తరలించగా, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఒంగోలు తరలించినట్లు తెలిసింది.